క్లుప్తంగా

పనితీరు మెరుగుపర్చుకోండి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ

పాలకొండ: సచివాలయాల ద్వారా మెరుగైన సేవలందించాలని డీఎల్‌డీఓ వీవీ గోపాలకృష్ణ సూచించారు. మండలంలోని వాటపాగు గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. అక్కడ అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. పనితీరు మెరుగుపర్చుకోవాలని సిబ్బంది సూచించారు. యూనిఫాంలు వేసుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమయపాలన పాటించాలని, జాబ్ చార్టు ప్రకారం సేవలందించాలని, సర్వీసులు పెంచాలని అన్నారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి కల్యాణం

వీరఘట్టం: భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక రమా సత్యనారాయణ స్వామి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం వైభవంగా చేపట్టారు. అర్చకులు సర్వాజ్యోశ్యుల సతీష్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని కల్యాణ అక్షితలను తలపై వేసుకున్నారు. అలాగే తెలగవీధి, కడకెల్లలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.

పాలకొండ: పట్టణంలోని విష్ణు ఆలయాల్లో భీష్మ ఏకాదశి పూజలు నిర్వహించారు. జగన్నాథస్వామి దేవాలయంలో అర్చకులు విశ్వనాథం దాస్ ఆధ్వర్యంలో మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు.

అసైన్డ్ భూముల గుర్తింపు

భామిని: నిరుపేదలకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వ, అసైన్డ్ భూములను గుర్తిస్తున్నట్లు తహసీల్దార్ నీలాపు అప్పారావు తెలిపారు. మండల కేంద్రంలోని గుర్తించిన అసైన్డ్ భూములకు బుధవారం కొలతలు వేసి హద్దులు నిర్ణయించారు. భూమి లేని పేద ఎస్సీ, ఎస్టీలకు పంపిణీకి భూములను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు మండల సర్వేయర్ తోట రామ్మోహనరావు, వీఆర్వో బిడ్డిక గోపాల్ ఉన్నారు.

ఫిష్ ఆంధ్రా అవుట్‌లెట్ ప్రారంభం

భామిని: మండలంలోని గురండిలో రూ.2.5 లక్షల వ్యాయంతో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్రా డైలీ డెలిషియస్ సెంటర్‌ను జిల్లా మత్స్యశాఖ అధికారి వేముల తిరుపతయ్య, ఎఫ్‌డీఓ డబ్బీరు గోపీకృష్ణతో కలిసి బుధవారం ప్రారంభించారు. చేపల్లో మనకు కావాల్సిన అన్ని పోషకాలు ఉంటాయని, వాటిని ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండొచ్చన్నారు. పాలకొండ డివిజన్ పరిధిలో సీతంపేటలో రూ.10 లక్షలతో ఫిష్ కియోస్కో యూనిట్, ఫిష్ ఆంధ్రా డెయిలీ డెలిషియస్ సెంటర్ మంజూరైనట్లు చెప్పారు. సింగిడిలో రూ.3 లక్షలతో ఫిష్ ఆంధ్రా మినీ ట్రయిల్ రన్ చేశారు. గుమ్మలక్ష్మీపురంలో డెయిలీ యూనిట్, సూపర్ యూనిట్ నిర్వహణకు స్థల పరిశీలన జరిపామన్నారు. భామిని ఎఫ్‌ఏ కె.ఆదినారాయణ, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

కురుపాం: బాధిత కుటుంబాలకు వైఎస్సార్ బీమా పథకం ఆసరాగా నిలుస్తుందని కురుపాం మార్కెట్ కమిటీ చైర్మన్ నిమ్మల వెంకటరావు, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, గ్రామ సర్పంచ్ అడ్డాకుల మన్మథరావు అన్నారు. బుధవారం నీలకంఠాపురం పంచాయతీకి చెందిన బిడ్డిక వీరయ్య మృతి చెందడంతో ఆయన భార్య బిడ్డిక మయంతి, కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేవారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి పెద్ద దిక్కు కోల్పోయి తీవ్ర ఆవేదనలో ఉన్న వారికి వైఎస్సార్ బీమా పథకం ఆసరాగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అమ్మవారి పండగ ఏర్పాట్లపై చర్చ

వీరఘట్టం: వీరఘట్టం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగ నిర్వహణపై చర్చించేందుకు స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామస్తులంతా సమావేశమయ్యారు. 2016లో అమ్మవారి పండగ చేశారు. ఏడేళ్ల తర్వాత పండగ చేస్తున్నందున ఘనంగా చేయాలని గ్రామపెద్దలు నిర్ణయించారు. గ్రామస్తుల అభిప్రాయాలను సేకరించారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించి ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. ఈనెల 8న మరోసారి కమిటీ సభ్యులు, పెద్దలు సమావేశమై పండగ తేదీలను ప్రకటించనున్నట్లు చెప్పారు.

నేటి నుంచి మహాలక్ష్మి పేరంటాలు జాతర

వీరఘట్టం: మండలంలోని తెట్టంగి గ్రామంలో వెలసిన మహాలక్ష్మి పేరంటాలు 46వ వార్షికోత్సవం గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించేందుకు గ్రామ పెద్దలు ఏర్పాట్లు చేశారు. ఆలయ ధర్మకర్త గుజ్జల రాము కుమారుడు నారాయణరావు, జయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయానికి రంగులు వేసి, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఏటా సంక్రాంతి పండగ తర్వాత గ్రామంలో మహాలక్ష్మి పేరంటాల జాతరను మూడు రోజుల పాటు వైభవంగా చేస్తారు.

కాల్చితే కాలుష్యం.. దున్నితే సారవంతం!

- పొలాల్లో పంట వ్యర్థాలను కాల్చడంతో నేలకు నష్టం
- పొగతో పర్యావరణానికి ముప్పు
- కలియదున్నితే భూసారం మెరుగు



పంట వ్యర్థాలను పొలంలో కాల్చివేస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: ఖరీఫ్ వరి కోతలు, నూర్పులు పూర్తయిన తర్వాత మిగిలిన పంట వ్యర్థాలను రైతులు పొలంలో కాల్చివేస్తున్నారు. దీని వల్ల నేల పొరల్లో ఉన్న మిత్రపురుగులు చనిపోవడంతో పాటు నేల తేమ శాతం కోల్పోతుంది. భూసారం కోల్పోతుంది. తరువాత సాగు చేసే పంట దిగుబడిపై ఆ ప్రభావం పడుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. పంట వ్యర్థాలు కాల్చడం ద్వారా వచ్చే పొగతో గాలి కాలుషితం అవడంతో పాటు పర్యావరణం దెబ్బతింటుంది. అదే పంట వ్యర్థాలను పొలంలో కలియ దున్నితే భూసారం పెరుగుతుందని సూచిస్తున్నారు.

ఎకరాకు రెండు టన్నుల వరకు వ్యర్థాలు

వ్యవసాయ రంగంలో వచ్చిన యాంత్రీకరణ కారణంగా కోత యంత్రాలతో 30 సెంటీమీటర్ల ఎత్తులో వరి దుబ్బులు కోత చేస్తున్నారు. దీంతో 50 శాతం గడ్డి వరిదుబ్బులు అవశేషాల రూపంలో వృథాగా ఉండిపోతున్నాయి. ఫలితంగా ఎకరానికి రెండు టన్నుల వరకు వరిదుబ్బులు, గడ్డి వ్యర్థాలుగా మారుతున్నాయి. ఒక టన్ను వ్యర్థాలు కాల్చితే 60 కిలోల కార్బన్ మోనాక్సైడ్‌తోపాటు, 1400 కిలోల కార్బన్ డై ఆక్సైడ్ గాలిలోకి విడుదలవుతుంది. ఇదే కాకుండా సూక్ష్మధూళి కణాలు, బూడిద గాలిలో కలవడంతో కాలుష్యం పెరుగుతుంది. నేల పొరల్లో తేమశాతం, భూసారం తగ్గిపోయి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

కలియదున్నడంతో ప్రయోజనాలు..

టన్ను వరిగడ్డి పెరగడానికి భూమి నుంచి 6.2 కిలోల నత్రజని, 11 కిలోల భాస్వరం, 18.9 కిలోల పొటాష్, కొద్ది మోతాదులో సూక్ష్మపోషకాలు అవసరమవుతాయి. అందువల్ల వరిదుబ్బులను కలియదున్నడంతో పోషకాలన్నీ తిరిగి నేలకు చేరుతాయి. లేకుంటే పంట వ్యర్థాలను ముడిపదార్థాలుగా వాడుకొని కంపోస్టు పద్ధతిలో సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవచ్చు. వరిపంట కోసిన వెంటనే మిగిలిన తేమను ఉపయోగించుకోవడంతో దుబ్బులు భూమిలో కలిసిపోయి క్రమేణా కుళ్లిపోతాయి. నాట్లు వేయడానికి ముందు దమ్ము చేసేటప్పుడు ఎకరానికి 50 కిలోల సూపర్ ఫాస్పేట్ వేసి, కలియదున్నడం వల్ల వరిదుబ్బులు వేగంగా కుళ్లిపోయి సేంద్రియ ఎరువుగా మారిపోతుంది. నేలలో సేంద్రియ కర్బన శాతం పెరగడమే కాకుండా పంట దిగుబడి 8 శాతం నుంచి 10 శాతం వరకు పెరుగుతుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. భూమి వేడెక్కడానికి ప్రధాన కారణమైన కార్బన్ డై ఆక్సైడ్ సాంద్రత తగ్గించాలన్నా, నేలలో కార్బన్ శాతం పెరగాలన్నా వ్యవసాయ వ్యర్థాలను తిరిగి నేలకు చేర్చడమే ఉత్తమ పద్ధతి.

కలియ దున్నుకోవాలి..



వరిదుబ్బులు, కోత మిషన్‌లో కోసిన వరిగడ్డికి నిప్పు పెడుతుంటారు. ఇలా చేయడంవల్ల నేల పొరల్లో తేమశాతం తగ్గి, పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వరిదుబ్బులతో ఎందుగడ్డిని కాల్చకుండా కలియదున్నాలి. ఇలా చేసినట్లయితే అందులోని పోషకాలన్నీ భూమిని చేరడంతో పాటు నేలలో తేమ నిలిచి ఉంటుంది. ఫలితంగా పంట దిగుబడులు పెరుగుతాయి. వరి దుబ్బులను కాల్చడంతో పర్యావరణానికి తీవ్ర నష్టంతో పాటు పశువులకు మేత కొరత ఏర్పడుతోంది. – ఆర్.విజయభారతి, వ్యవసాయాధికారి, గరుగుబిల్లి

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్



హస్తకళ ద్వారా తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

పాలకొండ: హస్త కళాకారులు వారికి అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రి సమీపంలోని కమ్యూనిటీ హాల్‌లో కేంద్ర జౌళిశాఖ పరిధిలోని హస్తకళా సేవా కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. హస్తకళాకారుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. సేవా కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ అపర్ణలక్ష్మీ హస్తకళాకారుల కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. న్యూహోప్ ఫౌండేషన్ చైర్మన్ బేతాళ సుదర్శన్ బెన్హర్, షేడ్ సంస్థ అధినేత సుధీర్ హస్తకళాకారులకు అండగా ఉంటామన్నారు. హస్తకళా కేంద్రం ద్వారా మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం స్టాల్స్‌ను పరిశీలించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

వీరఘట్టం: మండలంలోని బిటివాడ నాగావళి నదీ తీరం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను వండవ జంక్షన్ వద్ద బుధవారం పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఏఎస్సై కృష్ణంనాయుడు తెలిపారు. ఇసుక అక్రమంగా తరలిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

విద్యార్థికి సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పాలకొండ: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో బంగారు పతకం సాధించిన విద్యార్థి యామల అభిషేక్‌ను పాఠశాల సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. జనవరి 23,24 తేదీల్లో కర్నూలు జిల్లాలో జరిగిన అండర్–19 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పెదకాపువీధి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి అభిషేక్‌కుమార్ ప్రతిభ కనబరిచాడు. విద్యార్థిని హెచ్‌ఎం జామి రవి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.మల్లేశ్వరరావు, పి.ధర్మారావు, ఎ.రాంబాబు, ఎం.విద్యాలత పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పాలకొండ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల ఆరోగ్య భద్రతపై నిర్వాహకులు దృష్టి పెట్టాలని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలు సౌమ్య అన్నారు. పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె పరిశీలించారు. విలేజ్ హెల్త్ న్యూట్రిషన్ డే సందర్భంగా 0–5 సంవత్సరాల వయసున్న పిల్లలకు, గర్భిణులకు వేయాల్సిన వ్యాక్సిన్లు, తీసుకోవాల్సిన పౌష్టికాహారం, రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య వివరాలను రికార్డు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆమెతో పాటు హెచ్‌వీ ఇందిర, భూషణమణి తదితరులున్నారు.

ఉపాది పనులు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న పీవో నవ్య

సీతంపేట: ఉపాది పనులు పకడ్బందీగా నిర్వహించాలని ఐటీడీఏ పీవో బి.నవ్య అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నిర్ధేశించిన లక్ష్యాలు సాధించాలన్నారు. పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వేతనదారులకు రోజుకు రూ.257 వచ్చేలా చూడాలన్నారు. ఎంపీడీవో కోసూరు గీతాంజలి, ఏపీడీ శ్రీహరి పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



కేసు విచారణ చేస్తున్న డీఎస్పీ కృష్ణారావు, తదితరులు

సీతంపేట: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై బుధవారం పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు విచారణ చేశారు. ఎస్సై నీలకంఠం అందించిన వివరాల ప్రకారం మండలంలోని వలగెడ్డకు చెందిన హెచ్.ప్రసాదరావు విజయనగరం జిల్లా గరివిడి మండలం కోనూరుకు చెందిన మీసాల సత్యనారాయణ వద్ద 6 ఎకరాల 62 సెంట్ల భూమిని కొనుగోలు చేయడానికి రూ.40 లక్షలు చెల్లించారు. నెలలు గడుస్తున్నా భూమి చూపించి రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో వెళ్లి అడిగితే మళ్లీ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా కులం పేరుతో తమను దూషించారని ప్రసాదరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

సంపూర్ణ పోషణతో ఆరోగ్యం



సంపూర్ణపోషణ సరుకులు అందిస్తున్న ఎంపీటీసీ చంద్రశేఖర్

భామిని: మండలంలోని సొలికిరి, దిమ్మిడిజోల అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు బుధవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సరుకులను బాలేరు ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్ లబ్ధిదారులకు అందజేశారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. దిమ్మిడిజోలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ వి.రజినీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు వలరౌతు రామారావు పాల్గొని చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. కార్యక్రమంలో కార్యకర్తలు ఇందుమతి, సత్యవతి పాల్గొన్నారు.

ఉపాధి వేతనదారులు నిబంధనలు పాటించాలి



జియ్యమ్మవలస: ఉపాధి వేతనదారులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ రమేష్



గుమ్మలక్ష్మీపురం: ఉపాధిహామీ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సాల్మన్‌రాజు

జియ్యమ్మవలస: మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీఓ ఎస్.రమేష్ బుధవారం పరిశీలించారు. వేతనదారులు సమయానికి పనులకు హాజరుకాకపోవడం, మస్తర్లు నమోదు చేసుకుని తిరిగి వెళ్లిపోవడాన్ని గుర్తించారు. వేతనదారులు సమయపాలన పాటించాలని, నిబంధనల మేరకు పనులు చేయాలని సూచించారు. లేటుగా పనులకు వచ్చిన, తొందరగా ఇంటికి వెళ్లిపోయేవారి మస్తర్లు నమోదు చేయొద్దని మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.

కుక్కిడిలో..

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కుక్కిడి గ్రామంలో చేపట్టిన ఉపాధిహామీ పనులను ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు బుధవారం పరిశీలించారు. వేతనదారుల మస్తర్లతో పాటు ఇచ్చిన కొలతల మేరకు పనులు చేపడుతున్నదీ లేనిదీ పరిశీలించారు. రెండు పూటలా పనులు చేయాలని, అప్పుడే గిట్టుబాటు వేతనం అందుతుందన్నారు.

పాలకొండ రూరల్: కోటపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీఓ డొంక త్రినాథులు పరిశీలించారు. వేతనదారులకు పూర్తిస్థాయిలో పని కల్పించాలని, వేతనం గిట్టుబాటు అయ్యేలా చూడాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు.



పాలకొండ రూరల్: ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం



చిరుధాన్యాల పంటలను పరిశీలిస్తున్న అధికారులు

గుమ్మలక్ష్మీపురం: చిరుధాన్యాల పంటల సాగుపట్ల రైతులు ఆసక్తి చూపాలని వ్యవసాయశాఖ కమిషనరేట్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.ప్రేమ్‌శేఖర్ అన్నారు. మండలంలోని మంగళాపురం గ్రామంలోని గిరిజన రైతులు సాగుచేసిన చిరుధాన్యాల పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. చిరుధాన్యాల పంటలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం అనేక రాయితీలు అందిస్తోందన్నారు. రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు డీఏఓ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి సీహెచ్ ప్రసాద్ ఉన్నారు.

● పింఛన్ల పంపిణీ



సీతంపేట: గడికారెంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ లలిత



కొమరాడ: రాజ్యలక్ష్మీపురంలో వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ కన్వీనర్లు స్వర్ణప్రియ

కొమరాడ: మండలంలోని 20 సచివాలయం పరిధిలో గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో కలిసి బుధవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి బయోమెట్రిక్ నమోదు చేసి నగదు అందజేశారు. ఒకటో తేదీ ఉదయమే ఇంటికి వచ్చి పింఛను అందించడంతో అవ్వాతాతలు ఆనందం వ్యక్తం చేశారు. రాజ్యలక్ష్మీపురంలో కంబవలస సచివాలయ కన్వీనర్లు గంటా స్వర్ణప్రియ, తోరక సింహాచలం పింఛన్లు పంపిణీ చేశారు.

- **సీతంపేట:** ఏజెన్సీలో గిరిశిఖర గ్రామమైన గడికారెంలో సెల్‌సిగ్నల్ లేకపోవడంతో వెల్ఫేర్ అసిస్టెంట్ లలిత కొండపైకి ఎక్కి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాల అభివృద్ధే లక్ష్యం



పత్తి పంటను లారీలో తరలిస్తున్న ఆర్ట్స్ సంస్థ సభ్యులు

కురుపాం: రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఆర్థికంగా అభివృద్ధి చేయటమే లక్ష్యమని వివిధ ఉత్పత్తిదారుల సంఘాలకు చెందిన సీఈఓలు వినోద్‌కుమార్, ఎస్.సోనియా, ఉమామహేష్, ప్రభాకరరావు అన్నారు. జియ్యమ్మవలస మండలంలోని చినతోలుమండ గ్రామంలో ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో అంగరాలమ్మ సహజ ఎఫ్‌పీఓ ద్వారా కొనుగోలు చేసి పత్తిని బుధవారం తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల్లో రైతు ఉత్పత్తిదారు సంఘాల బలోపేతమే లక్ష్యమని అన్నారు. గిరిజన రైతులకు గిట్టుబాటు ధర చెల్లించి పత్తి పంటను కొనుగోలు చేసినట్లు చెప్పారు. దీంతో పాటు వరి, జొన్న, చింతపండు, ఇతర పంటలకు కూడా గిట్టుబాటు ధరలు కల్పించేందుకు ఆర్ట్స్ సంస్థ చర్యలు చేపట్టిందన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

పాలకొండ: స్థానిక ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ఉద్యోగులు బుధవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. 34వ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు రక్తదాన శిబిరంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఆస్పత్రి ఆర్ఎంఓ జె.రవీంద్రకుమార్ మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఎంతోమందికి ప్రాణదాతలు కాగలరని అన్నారు. యువత అపోహలు వీడి రక్తదానం చేసేందుకు ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగభూషణరావు, వైద్యులు పాల్గొన్నారు.

42 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ కృష్ణారావు

పాలకొండ రూరల్: కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నవారు వైఎస్సార్ కంటివెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కృష్ణారావు అన్నారు. పాలకొండ నగరపంచాయతీ పరిధి వీవర్స్‌కాలనీలో బుధవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. కంటి సమస్యలతో అవస్థలు పడుతున్న 42 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అదించారు. నేత్ర సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

నిత్యాన్నదానం ప్రారంభం



పేదకు దుస్తులు పంపిణీస్తున్న ట్రస్టు చైర్మన్, తదితరులు

పాలకొండ రూరల్: స్థానిక కొత్తవీధిలో ఉన్న షారోను ప్రార్థనా మందిరంలో బుధవారం నుంచి నిత్యాన్నదాన పథకాన్ని ప్రారంభించారు. సంగీతరావు సత్యవేదం మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్, పాస్టర్ యేసురత్న రాజ్‌కుమార్ నేతృత్వంలో 150 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దైవ సేవకులు కిరణ్‌కుమార్, జ్యోతిఫెడ్రిక్ సూర్యప్రకాష్, యఙ్రా, కుమార్‌రాజు తదితరులున్నారు.

ముగిసిన ఆలయ ప్రతిష్ఠోత్సవం



ఆలయంలో ప్రతిష్ఠించిన విగ్రహాలు



ఎమ్మెల్యే జోగులుకు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ కమిటీ

వీరఘట్టం: మండలంలోని చిదిమి గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న పార్వతీ సమేత కాశీసుందర విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు బుధవారంతో ముగిశాయి.

చివరిరోజు ఆలయంలో మరకత శివలింగాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు సర్వాజ్యోశ్యుల వెంకటరమణశాస్త్రి ఆధ్వర్యంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మరకత లింగానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ చేశారు. ఎమ్మెల్యే కంబాల జోగులు మరకత శివలింగాన్ని దర్శించుకుని పూజలు చేశారు.